అద్దెభవనంలో అవస్థలు



అద్దె భవనంలో కొనసాగుతున్న గండేడ్ కేజీబీవీ పాఠశాల

- చాలీచాలని గదులు
- ఒకే గదిలో తరగతులు, బెడ్రూం
- కేజీబీవీ విద్యార్థుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



గదిలో ఇరుకుగా విద్యార్థుల లగేజీ

గండేడ్: కొత్త కేజీబీవీ ఏర్పాటుకు ఏళ్ల తరబడి ఎదురు చూసి, ఈ ఏడాది ఆ కోరిక నెరవేరింది. ఎలాగైనా తాము ఎంచక్కా చదువుకోవచ్చనుకున్న విద్యార్థులకు వసతుల్లేక ఆశనిపాతంగా పరిణమించింది. విద్యార్థుల సంఖ్య పెంచే అవకాశం లేక పోగా, ఉన్నవారికి ఇక్కట్లు తప్పడం లేదు. గండేడ్ మహమ్మదాబాద్ మండలాలు ఉమ్మడిగా ఉన్నప్పుడు కేజీబీవీ పాఠశాలను కంచన్‌పల్లి శివారులో ఏర్పాటు చేశారు. 2020లో ఉమ్మడి గండేడ్ మండలం గండేడ్, మహమ్మదాబాద్ మండలాలుగా విడిపోయింది. అప్పటి నుంచి గండేడ్‌కు కొత్త కేజీబీవీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల రోజు మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి కొత్త కేజీబీవీని ప్రారంభించినా, ఎన్నికల తర్వాత కూడా ప్రారంభానికి నోచుకోలేదు. 2023–24లో గండేడ్ మండలానికి కొత్త కేజీబీవీ మంజూరైంది. అయితే అకామిడేషన్ లేని కారణంగా మహమ్మదాబాద్ కేజీబీవీలోనే కొనసాగించారు. ఆరు, ఏడు తరగతులకు సంబంధించి అడ్మిషన్లు తీసుకున్నవారు అక్కడే చదువుతున్నారు. 2024–25 సంవత్సరానికి రెండో ఏడాది కూడా మంజూరు కాకపోవడంతో గండేడ్ కేజీబీవీ విద్యార్థులు మరోమారు మహమ్మదాబాద్‌లో ఉండే చదవాల్సి వచ్చింది. దీంతో ఆ సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గండేడ్ కేజీబీవీని ఏర్పాటు చేసి విద్యార్థులను అక్కడికి పంపాలని ఉపాధ్యాయులు పలుమార్లు అధికారులకు విన్నవించారు. అకామిడేషన్ దొరక్కపోవడంతో జాప్యం జరిగింది. చివరకు ఎలాగైనా గండేడ్‌లో పాఠశాలను ఏర్పాటు చేయాలని అధికారులు ఒత్తిడి తీసుకురావడం, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పట్టుబట్టారు. గండేడ్ మండల కేంద్రంలోని విశ్వభారతి కళాశాలలో తాత్కాలిక వసతి ఎంపిక చేశారు. ఈ మేరకు జనవరి 19న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గండేడ్‌లో కొత్త కేజీబీవీని ప్రారంభించారు.

తరగతి గదుల్లోనే నిద్ర..

ప్రస్తుతం గండేడ్ కేజీబీవీలో నాలుగు తరగతులు కొనసాగుతున్నాయి. వాటిలో 188 మంది విద్యార్థులు ఉన్నారు. ఆరులో 45, ఏడులో 50, ఎనిమిదిలో 45, తొమ్మిదిలో 48 మంది విద్యార్థుల చొప్పున ఉన్నారు. ఉన్న 188 మంది విద్యార్థులకు ఇప్పుడున్న వసతి పూర్తి స్థాయిలో సరిపోవడం లేదు. మొత్తం 12గదులు ఉండగా, అందులో వంట గది, భోజనం గదులు, స్టోర్ రూంలు, లగేజీ గదులు, స్టాఫ్‌రూం, తరగతి గదులు కొనసాగుతున్నాయి. లగేజీ రెండు గదుల్లో పెట్టుకున్నా అది ఇరుకుగా ఉంది. అక్కడ పడుకోవడానికి మాత్రం రాదు. దీంతో ఉన్న గదులు ఉదయం తరగతులు రాత్రికి నిద్రగదులుగా మారుతున్నాయి. భోజనానికి ప్రత్యేక డార్మెంటరీ లేదు. ల్యాబ్‌లు, గ్రంథాలయం, క్రీడాగదులు వేరుగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు 10 ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్నానాల సమయంలో కూడా వారికి సమస్యలు తప్పడం లేదు.

నిర్మాణంలో పక్కాభవనం..

మండల కేంద్రంలో కేజీబీవీ పక్కా భవన నిర్మాణం కోసం రూ.5 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. నిర్మాణం ప్రారంభమై ఆరు నెలలు కావస్తోంది. మరో నెలల్లో ఇది పూరయ్యే అవకాశం ఉంది. పనులు చురుగ్గా కొనసాగుతున్నా ఈ విద్యా సంవత్సరానికి మాత్రం ఇది అందుబాటులోకి రావడం లేదు. దీంతో విద్యార్థులకు ఈఏడాది ఇక్కట్లు తప్పేలా లేవు.

అవకాశం కోల్పోతున్న విద్యార్థులు

పూర్తిస్థాయి అకామిడేషన్ లేకపోవడంతో చాలా మంది విద్యార్థులకు ఇక్కడ చదువుకొనే అవకాశం లేకుండా పోతోంది. మండలంలో ఇంకా చాలామందికి అవకాశం లేకపోవడంతో పక్క మండలాలకు వెళ్తున్నారు. దీంతో పాటు ఇక్కడ ఏఎస్ఎం పోస్టు కూడా ఖాళీ ఉంది. కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు కూడా భర్తీ కాలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పక్కా భవనం వీలైనంత త్వరగా అందుబాటులోకి తెచ్చి ఎక్కువ మొత్తంలో విద్యార్థులకు చదువుకొనే అవకాశం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు సరైన వసతిలేదు..

పూర్తిస్థాయిలో వసతి లేకపోవడంతో విద్యార్థులను ఎక్కువగా తీసుకోలేకపోతున్నాం. ఇబ్బందులు ఉన్నా ఉన్నదాంట్లోనే సర్దుకుంటున్నాం. తరగతులు తక్కువగా ఉండడంతో నెట్టుకొస్తున్నాం. పక్కా భవనం అందుబాటులోకి వస్తే అన్ని సమస్యలు తీరుతాయి.

– శివలీల,ఏఎస్ఓ, కేజీబీవీ గండేడ్

క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్

మహమ్మదాబాద్: మండలంలో తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డితో మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన రెవెన్యూ కార్యాలయం వసతులు ఎలా ఉన్నాయి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని అడిగారు. విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల వచ్చిన భూ భారతి ద్వారా రైతుల సమస్యలు త్వరగా పరిష్కరించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, ఆర్ఐ హైమద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అక్షయపాత్ర ద్వారా నాణ్యమైన భోజనం

భూత్పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనాన్ని అక్షయ్ పాత్ర ద్వారా విద్యార్థులకు అందిస్తున్నారని మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని తాటికొండ ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్ ప్రారంభించారు. బహుజన టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో అక్షయ పాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం అందించాలని ఇటీవల జిల్లా కలెక్టర్, డీఈఓకు వినతి పత్రం అందించారు. ఎంఈఓ ఉషారాణి, బహుజన్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పట్నం చెన్నయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికధరలకు పాఠ్యపుస్తకాల విక్రయం

జడ్చర్ల: ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పుస్తకాలపై ముద్రించిన ధరకు రెట్టింపుగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. లక్ష్మీకాలనీలో నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాలలో రెట్టింపు ధరలకు పుస్తకాలు విక్రయించడంపై తాము డీఈఓతో ఆటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని విద్యార్థి తండ్రి మహ్మద్ ఆరీఫ్ తెలిపారు. స్కూల్ నిర్వాహకులను ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొన్నాడు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



జడ్చర్ల: 9న చేపట్టనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం మండల పరిధిలోని జడ్చర్ల, గంగాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శ్వేత, డాక్టర్ ప్రతాప్ చౌహాన్‌లకు ఆశా వర్కర్స్‌తో కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు శివలీల, నర్సమ్మ, సమంత, కృష్ణవేణి పాల్గొన్నారు.

కార్మికులను బలి చేయొద్దు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికులను బలి చేయొద్దని రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు సి.వెంకటేష్ అన్నారు. 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన నోటీసును జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కుమారస్వామిలకు అందజేశారు.

‘మట్టి రోడ్డును మేమే వేయించాం’

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ గ్రామం నుంచి దాసర్‌పల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఇటీవల మట్టిని వేయించిన దానిపై ఎంబీ రికార్డు చేయించారని బీఆర్ఎస్ నాయకులు పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో దానిపై మండల వ్యాప్తంగా చర్చ సాగుతోంది. స్నేహ పరిశ్రమ నిర్వాహకులే రోడ్డుపై మట్టిని వేయిస్తే కాంగ్రెస్ నాయకులు బిల్లు చేయించుకున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలను స్థానిక కాంగ్రెస్ నాయకుడు హేమవర్ధన్‌రెడ్డి కొట్టి పారేశారు. చెరువులోంచి మట్టిని తరలించే క్రమంలో అక్కడక్కడ ఉన్న గుంతల్లో కొంత మట్టిని కంపెనీ నిర్వాహకులు వేయించారని తెలిపారు. తాము ట్రాక్టర్లతో పొన్నకల్ గ్రామం నుంచి సుమారు కిలోమీటర్‌కు పైగా రోడ్డుపై మట్టిని వేయించి యంత్రాలతో రోడ్డును చదును చేయించామని తెలిపారు. తామే రోడ్డును వేయించినందున నిబంధనల ప్రకారం అధికారులు ఎంబీ రికార్డు చేశారన్నారు. దీనిపై బీఆర్ఎస్ నాయకులు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మిడ్జిల్: మండలంలోని చిల్వేర్ గ్రామంలో గురువారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను గ్రామస్తులు పట్టుకున్నారు.

6న హరికథా గానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తువ్వగుట్టలోని బసవభవన్‌లో 6న బసవేశ్వరుడి చరిత్రపై హరికథ ఉంటుందని వీరశైవ సమాజం కార్యదర్శి శంకర్‌లింగం ప్రకటనలో తెలిపారు.

విద్యార్థుల చదువే దేశానికి వెలుగు

నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



కళాశాల భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, ఎంపీ డీకే అరుణ

కోయిల్‌కొండ: విద్యార్థుల చదువే దేశానికి వెలుగు నింపుతుందని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, ఎంపీ డీకే. అరుణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సర్వశిక్ష అభియాన్ నిధులు రూ.2 కోట్ల 30లక్షలతో నిర్మించిన నూతన కళాశాల భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహకాలను కస్తూర్బా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో మంజూరైన 783మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలు ఎమ్మెల్యే అందించారు. అనంతరం మహబూబ్‌నగర్ నుంచి కోయిల్‌కొండ మీదుగా సూరారం ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ పుష్పలత, ఎంపీడీఓ కాళప్ప, పాఠశాల ప్రిన్సిపాల్ హారిక, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ డీకే అరుణ అన్నారు. మండల కేంద్రంలో శ్రీఆదిఆంజనేయస్వామి దేవాలయాన్ని ఎంపీ డీకే అరుణ సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అర్చకులు రాఘవేందర్‌రావు, మధుసూరెడ్డి, రాములుగౌడ్, పార్థసారథి, నాగరాజు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌ఓల పాత్ర కీలకం



బీఎల్‌ఓల శిక్షణలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

నవాబుపేట: ఎన్నికల్లో బీఎల్‌ఓల పాత్ర చాలా కీలకమని, వారు చేసే పనిని బట్టే ఎన్నికలు సైతం పకడ్బందీగా జరుగుతాయని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రలో బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా చాలా ముఖ్యమని, అలాంటి దాన్ని రూపొందించటంలో బీఎల్ఓలు కీలకంగా ఉంటారన్నారు. చేర్పులు, తొలగింపులు తదితర వాటి విషయంలో తాజాగా వచ్చిన సూచనలు వారికి శిక్షకులు వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ సువర్ణ, స్పోక్‌పర్సన్ ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

నవాబుపేట: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి రావాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. గురువారం మండలంలోని రాంసింగ్‌తండా, ఊరంచుతండా, హజిలాపూర్ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా పథకాలు పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు తీసుకొచ్చాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. చిన్న పరిశ్రమలు, వ్యక్తిగత స్వయం ఉపాధి పథకాలను వినియోగించుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మండల అధికారులతో పాటు కార్యక్రమ నిర్వాహకులు భాస్కర్, శిరీష, శాంతికుమారి, శంకర్‌నాయక్, గోపాల్, తదితరులు ఉన్నారు.

‘కాంగ్రెస్‌కు ఓట్లు వేసి తప్పు చేశాం



బీఆర్ఎస్ నాయకుడు క్యామ మల్లేశంను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి తప్పు చేశామని, ఎక్కడికి పోయినా ప్రజలు చెబుతున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఎన్నికల్లో నాయకులు సమన్వయంతో పని చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు క్యామ మల్లేశం మాట్లాడుతు బీఆర్ఎస్ ప్రభుత్వం క్యాబినెట్‌లో యాదవ సామాజిక వర్గానికి అవకాశం కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటి ఆధిప్యం పోరు ప్రారంభం అయిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 1000 కోట్ల విలువైన కోకాపేట్‌లో 5 ఎకరాల కురుమ సంఘానికి కేటాయించినట్లు తెలిపారు. అనంతరం క్యామ మల్లేశంను సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, నర్సింహులు, గణేష్, కోట్ల నర్సింహులు, జీవన్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్‌పై అకారణంగా దాడి చేసిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దవిజయ్‌పై చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ రాజీవ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులు చేయడం రాజకీయ నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. కార్యక్రమంలో జిల్లా టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి చంద్రనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, జాయింట్ సెక్రటరీ మల్లయ్య, టీజీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, కోశాధికారి టైటస్ పాల్, వైద్య ఆరోగ్య శాఖఉద్యోగ సంఘం అధ్యక్షుడు సుభాస్‌చంద్రబోస్, చంద్రశేఖర్, వెంకట్‌రాములు, శ్రీశైలంపాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్



జానంపేట పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సందర్శించారు. దేవరకద్ర నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం ఇక్కడి పాఠశాలలో ఉన్న వసతులు, స్థలాన్ని ఆయన పరిశీలించారు. పాఠశాలలోని వసతులపై ఆరా తీసి తరగతి గదులను సందర్శిచారు. గదుల కొరతతో పాటు ప్రహరీ లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులు ఆయన దృష్టికి వచ్చాయి. విద్యార్థుల కోసం తెచ్చిన మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రవీన్‌కుమార్, ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, హెచ్ఎం గీతాదేవి, ఏపీసీ చైర్మన్ భాగ్యమ్మ ఉన్నారు.

నేడు బీఎల్‌ఓలకు అవగాహన

గండేడ్: బీఎల్‌ఓలకు అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మల్లికార్జున్ రావు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వెన్నాచేడ్ సాయిరాం ఫంక్షన్‌హాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మండలంలోని గ్రామాల బీఎల్‌ఓలు హాజరు కావాలని ఆయన కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా పలు కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్లు డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం పరీక్ష రాసిన వారి మెరిట్‌లిస్టు 1:3 రేషియో ప్రకారం ఎంపిక చేసి వారి పేర్లను డీఈఓ కార్యాలయం నోటీస్‌బోర్డు లో ఉంచినట్లు తెలిపారు. పేర్లు ఉన్న అభ్యర్థులు ఈ నెల 5న జరిగే సర్టిఫికెట్స్ వేరిఫికేషన్‌కు హాజరుకావాలని సూచించారు.

నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీ

జిల్లా వ్యాప్తంగా పలు కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను నేరుగా డీఈఓ కార్యాలయం, లేదా ఆన్‌లైన్‌లో నేటి నుంచి ఈనెల 7వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

మొహర్రం వేడుకలు

భూత్పూర్: మండలంలోని కొప్పెటలో మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కుల, మతాలకు అతీతంగా చేపట్టే పీర్ల ఊరేగింపులో గ్రామంలో పెద్ద సంఖ్యలో హాజరై మొహర్రం వేడుకలు ప్రతి ఏటా జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది.

ప్రభుత్వ పాఠశాలలకు చేయూత



సంస్థ నిర్వాహకులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నవాబుపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు కావాల్సిన విద్యావస్తువులు స్వచ్ఛందంగా అందించేందుకు అప్‌గ్రేడ్ మై స్కూల్ అనే స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చిందని మండల విద్యాశాఖ అధికారి నాగ్యనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రలో ఎంఈఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు కోటిరెడ్డి, శ్రీహరి వివరించారు. దీంతో పాఠశాలలకు కావాల్సిన వస్తువులపై ఆయా పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎం దశరత్‌నాయక్, నాయకులు భూపతిసింగ్, శ్రీనివాస్, శ్యాంసుందర్‌రెడ్డి, రామకృష్ణ, సల్వచారి, వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

భూ భారతి దరఖాస్తుల పరిశీలన

గండేడ్: భూభారతిలో వచ్చి దరఖాస్తుల పరిశీలన మొదలు పెట్టాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్ పేర్కొన్నారు. కొత్తగా విధుల్లో చేరిన గురువారం గండేడ్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసదర్భంగా ఆయన సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. ఏమైనా పోస్టులు ఖాళీగా ఉన్నాయా అని తహసీల్దార్ మల్లికార్జున్‌రావును అడిగారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ప్రారంభించాలని ఆయన అధికారులకు సూచించారు. తిరస్కరిస్తే అందుకు సంబంధించిన కారణాలు పూర్తి స్థాయిలో తెలియజేయాలన్నారు. సందర్భంగా తహసీల్దార్ మల్లికార్జున రావు, డీగటి మాధవి, ఆర్ఐ యాసిన్, జూనియర్ అసిస్టెంట్ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగసభ విజయవంతం చేయాలి

గండేడ్: నేడు హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పీసీసీ మెంబర్ నరసింహరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో అధ్యక్షులు, పట్టణాధ్యక్షులు హాజరుకావాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

చిన్నచింతకుంట: మండలంలోని పర్దీపూర్‌లో గనేవానం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంకు అధికారులు ముగ్గు పోసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి కుర్మన్న మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

నిజాలాపూర్ హెచ్ఎం ఔదార్యం



నిజాలాపూర్‌లో ఐఏ ఆధారిత బోధన ప్రారంభిస్తున్న అధికారులు

అడ్డాకుల: మూసాపేట మండలం నిజాలాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బాలకృష్ణయ్య పాఠశాలకు కంప్యూటర్‌ను అందజేసి ఔదార్యం చాటుకున్నారు. ఇటీవల ఏఐ ద్వారా చదువుల్లో వెనుకబడిన విద్యార్థుల సామర్థ్యాలను పెంచడానికి ప్రభుత్వం ప్రైమరీ స్కూళ్లకు ట్యాబ్‌లను అందజేయగా, ఇక్కడ హెచ్ఎం మరో కంప్యూటర్‌ను తీసుకొచ్చి విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. బుధవారం మండల విద్యాధికారి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సీజీ గోవర్ధన్‌తో కంప్యూటర్ ఆధారిత బోధనను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు సీజీ.గోవర్ధన్, ఏఏపీసీ చైర్మన్ రాజేశ్వరమ్మ, హైస్కూల్ జీహెచ్ఎం ఫయాజుద్దీన్ ఉన్నారు.

ఉపాధ్యాయురాలి సేవలు అభినందనీయం



సంగాయపల్లి పాఠశాలలో నోట్‌పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

మహమ్మదాబాద్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు అందించడం అభినందనీయమని మండల విద్యాధికారి రాజునాయక్ తెలిపారు. గురువారం మండలంలోని సంగాయపల్లి తండా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు మమత తన ఎస్ఎస్‌సీ స్నేహితులతో కలిసి విద్యార్థులకు తగిన సహాయం చేయడం గొప్పవిషమన్నారు. ఈసందర్భంగా పీఆర్‌టీయూ, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్, వెంకటయ్య, భీంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చౌదర్‌పల్లిని సందర్శించిన కమిషనర్



చౌదర్‌పల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామాన్ని గురువారం కమిషనర్ నరేష్ సందర్శించారు. వంద రోజుల పట్టణ ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాన్ని సందర్శించి పలు వీధులను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ హన్మంతరెడ్డి పాల్గొన్నారు.


అఖిలభారత అయ్యప్ప దీక్ష నగర కమిటీ ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి నగర కమిటీని బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా యాదయ్యగౌడ్, ఉపాధ్యక్షులుగా భీంరాజ్, రఘు, శ్రీను, యదయ్య, శ్రీనివాస్, కోశాధికారిగా బాలప్రసాద్‌తో పాటు సహాయ కార్యదర్శులు ఐదుగురిని, కార్యదర్శులుగా తొమ్మిదిమందిని, సలహాదారులుగా ఇద్దరిని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు సీమ నరేందర్ తెలిపారు. అమావాస్య అన్నదాన కమిటీ అధ్యక్షులుగా రఘురాంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా మంత రవిశంకర్, ఉపాధ్యక్షులుగా బాలస్వామి, సహాయ కార్యదర్శులుగా ఐదుగురిని, కార్యదర్శులుగా ఎనిమిది మందిని ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఓటర్ల నమోదు చేయించాలి



దేవరకద్ర: కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలని ఈఆర్ఓ మధుసూదన్‌నాయక్ కోరారు. గురువారం దేవరకద్ర రైతు వేదికలో జరిగిన బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితాలో తొలగింపుల విషయంలో పూర్తిగా విచారణ చేయాలని సూచించారు. ఓటర్ల సవరణ చేపట్టాలని తప్పులను సవరించడం, అడ్రస్ మార్పులు ఇంకా ఏమైనా సమస్యలుంటే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, డీటీలు రాధిక, స్వప్న పాల్గొన్నారు.

కలెక్టరేట్ లిఫ్ట్‌లో ఇరుక్కున్న ఉద్యోగి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కలెక్టరేట్‌లోని మొదటి లిఫ్ట్‌లో ప్రభుత్వ ఉద్యోగి ఇరుక్కున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. విధి నిర్వహణలో భాగంగా ఓ ఉద్యోగి కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్ పక్కన ఉన్న మొదటి లిఫ్ట్‌లో ఎక్కిన వెంటనే ఉన్నట్లుండి కరెంట్ పోవడంతో లిఫ్ట్ ఆగిపోయింది. దీంతో అక్కడ ఉన్న ఉద్యోగులు కొంత సేపు ఆందోళన పడ్డారు. కలెక్టరేట్ సిబ్బంది వెంటనే అప్రమత్తం అయ్యి జనరేటర్ వేయడంతో లిఫ్ట్ ఆన్ కావడం అందులోఉన్న ఉద్యోగి బయటకు రావడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. 15 నిమిషాలు ఉద్యోగి లిఫ్ట్ లోనే ఉన్నారు. లిఫ్ట్ ఆన్‌అయి బయటకు రావడంతో అమ్మయ్య సేఫ్‌గా బయట పడ్డాను అని ఆ ఉద్యోగి అనుకున్నారు. కరెంట్ పోయినప్పుడు తరచు ఇలాంటి సంఘటనలు జరుగడం పరిపాటిగా మారిందని అక్కడి ఉద్యోగులు అనుకోవడం కనిపించింది.